ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





తిరుమలలో హనుమ వాహనంపై శ్రీరాముడి విహారం - సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం



తిరుపతి కోదండరామాలయంలో రద్దీ

వేడుకగా శ్రీరామనవమి

తిరుమల, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలు బుధవారం జిల్లావ్యాప్తంగా వేడుకగా జరిగాయి. రామాలయాల్లో భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలో నవమి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి తోమాలసేవ, అర్చన సేవలను నిర్వహించారు.9 నుంచి 11 గంటల వరకు సీతారామ లక్ష్మణ సమేత హనుమంత స్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవను నిర్వహించారు. తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతి మంత్రాలను, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే పాశురాలను వేదపండితులు పఠించారు.సాయంత్రం 6.30 గంటలకు వాహనమండపంలో భక్తుడైన హనుమంతుడిపై శ్రీరామచంద్ర మూర్తిని కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.టీటీడీ ఈవో ధర్మారెడ్డి, పేష్కార్ శ్రీహరి, డిప్యూటీఈవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య బంగారు వాకిలి వద్ద శ్రీరామనవమి ఆస్థానాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు.

పట్టాభిరాముడిని తాకిన ఉదయభానుడి కిరణాలు

వాకాడు, ఏప్రిల్ 17 : వాకాడు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలిరెడ్డి పాళెం పట్టాభిరామాలయంలో శ్రీరామనవమి పర్వదినాన మూల విరాట్టును సూర్య కిరణాలు పాక్షికంగా తాకాయి. ఉదయం 7గంటల ప్రాంతంలో దాదాపు 5 నిమిషాల పాటు సూర్యకిరణాలు స్వామి వారిని తాకాయని, తెల్లవారుజాము నుంచే భక్తులు వేచివుండి ఈ అద్భుత ఘటనను చూశారని ఆలయ ప్రధానార్చకులు దివి అనంతాచార్యులు, ధర్మకర్త కొడవలూరు భక్తవత్సల రెడ్డి తెలిపారు.



వైసీపీ ప్రచారాలకు వలంటీర్లే దిక్కు!

జిల్లాలో వలంటీర్ల రాజీనామాలు అధికారిక లెక్కల ప్రకారం వెయ్యి దాటాయి. ఎంత బలగం వున్నా, ఎన్ని వనరులున్నా ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీ నేతలకు వలంటీర్లే దిక్కవుతున్నారు. అయితే ఎన్నికల కమిషన్ నుంచీ ఆంక్షలున్న కారణంగా వాటి నుంచీ తప్పించుకుని స్వేచ్ఛగా ఎన్నికల ప్రచారానికి వినియోగించుకునేందుకు వారిపై రాజీనామాలకు ఒత్తిడి తెస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో రాజీనామా చేసే వలంటీర్లకు ప్రత్యేకంగా ఆఫర్లు కూడా ఇస్తున్నారు. రాజీనామాలకు వస్తున్న ఒత్తిడిని బట్టి చూస్తుంటే అధికార పార్టీ ఎన్నికల్లో వలంటీర్లపై ఏ స్థాయిలో ఆధారపడుతోందో చెప్పకనే చెబుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



- రిజైన్ చేసి ప్రచారంలోకి రావాలంటూ వైసీపీ నాయకుల ఒత్తిడి
- రెండు నెలలకు రూ. 20 వేలు ఆఫర్‌తో పాటు జూన్‌లో మళ్ళీ కొనసాగింపు హామీ

జిల్లావ్యాప్తంగా వెయ్యిమందికి పైగా రాజీనామా

జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం మంగళవారం నాటికి 1058 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. సోమవారం వరకూ 902 మంది విధుల నుంచీ తప్పుకోగా మంగళవారం మరో 156 మంది బాధ్యతల నుంచీ తప్పుకున్నారు. అత్యధికంగా చంద్రగిరి నియోజకవర్గం నుంచీ 276మంది వలంటీర్లు రాజీనామా చేయగా సూళ్ళూరుపేట నుంచీ 264మంది, శ్రీకాళహస్తిలో 233మంది, వెంకటగిరి నుంచీ 149మంది, గూడూరులో 95మంది, తిరుపతిలో 34మంది, సత్యవేడులో అత్యల్పంగా ఏడుగురు రాజీనామాలు సమర్పించారు. అనధికారికంగా చూస్తే రాజీనామా చేసిన వారి సంఖ్య దీనికి రెట్టింపు కంటే ఎక్కువగా వుంది. వలంటీర్లు తమ రాజీనామా లేఖలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేస్తున్నారు. వారు రికార్డు తయారు చేసుకుని ఎంపీడీవోలకు సమర్పించాలి. ఎంపీడీవోలు ఆ సమాచారాన్ని జిల్లా కేంద్రంలోని డీఎల్‌డీవోకు నివేదించాలి. సంబంధిత అధికారి అప్రూవ్ చేశాకే రాజీనామా అధికారికమవుతుంది. ఈ ప్రక్రియకు రెండుమూడు రోజులు పడుతున్నందున ఏరోజుకారోజు రాజీనామాల సంఖ్య అధికారికంగా ప్రకటించడం లేదు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన 23 మంది తొలగింపు

జిల్లాలో ఇప్పటి వరకూ ఎన్నికల నియమావళి ఉల్లంఘన కారణంతో తొలగించిన వలంటీర్ల సంఖ్య 23కు చేరింది. శ్రీకాళహస్తిలో అత్యధికంగా తొమ్మిది మందిని, సత్యవేడులో ఏడుగురిని, తిరుపతిలో ఐదుగురిని, గూడూరు, సూళ్ళూరుపేటల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 23మందిని ఇప్పటి వరకూ తొలగించారు.అధికార పార్టీ నేతలకు ఎంత అనుచరగణమున్నా, ఎన్ని ఆర్థిక వనరులున్నా ఎన్నికల్లో మాత్రం ప్రధానంగా వలంటీర్లపైనే ఆధారపడుతున్నారు. గ్రామ, వార్డుల పరిధిలో వలంటీర్లకున్న విస్తృత పరిచయాలు, ప్రభావం ఇతరులకు వుండడం లేదు. ప్రతి యాభై ఇళ్ళకు ఒక వలంటీరు అందుబాటులో వుండడం, ఆ యాభై కుటుంబాలను తరచూ కలుస్తూ వుండడం, ప్రభుత్వ పథకాల లబ్ధిని అందజేస్తుండడం, ఇతరత్రా ప్రభుత్వ పనులకు కూడా జనం వారిపై ఆధారపడుతుండడం దీనికి కారణం. దీంతో ఏ కుటుంబం పరిస్థితి ఏమిటి? ఏ కులం లేదా ఏ మతం? ఎంతమంది ఓటర్లున్నారు? వారిలో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతున్నది ఎంతమంది? వారి నేపథ్యం? ఏ పార్టీకి సానుభూతిపరులు? వంటి సమాచారం వలంటీర్ల నుంచే రాబడుతున్నారు. వీటన్నింటికీ మించి ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులను, పార్టీ నేతలను కూడా వలంటీర్లే ప్రజలకు పరిచయం చేయాల్సిన పరిస్థితి. దీనికి మించి పంపకాలకు వలంటీర్లను మించిన నమ్మకమైన ప్రత్యామ్నాయం అధికార పార్టీ నేతలకు మరొకరు దొరకడం లేదు. ఈ అంశాలను దృష్టిలో వుంచుకుని అధికార పార్టీ నేతలు వలంటీర్లపైనే భారం వేస్తున్నారు. ఆ పనులు స్వేచ్ఛగా, నిరాటంకంగా జరగడం కోసం రాజీనామాలకు ఒత్తిడి తెస్తున్నారు.

చంద్రగిరిలో నగదు ఆఫర్

చంద్రగిరి నియోజకవర్గంలో వలంటీర్ల రాజీనామాలకు అధికార పార్టీ నేతలు నగదు ఆఫర్ చేస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు తమ పరిధిలోని వలంటీర్లను కలసి రాజీనామా చేసి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఒత్తిడి చేస్తున్నారు. అందుబాటులోకి రాని వారికి పదేపదే ఫోన్లు చేస్తున్నారు. రాజీనామా చేయడానికి ఇష్టపడని వారు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకుని అందుబాటులో లేకుండా పోతున్నారు. నెలకు రూ. 5 వేల గౌరవ వేతనం పొందుతున్న సంగతి గుర్తు చేస్తున్న నాయకులు రాజీనామా చేస్తే ఏప్రిల్, మే నెలలకు గానూ రూ. 10 వేల చొప్పున రూ. 20 వేలు చెల్లిస్తామని ఆఫర్ ఇస్తున్నారు.జూన్‌లో పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని, ఆ నెల నుంచీ వలంటీర్లుగా మళ్ళీ కొనసాగిస్తామని నచ్చజెబుతున్నారు. ఒత్తిళ్లు కావచ్చు లేదా మొహమాటం కావచ్చు అదీ కాకుంటే నగదు ఆఫర్లకు మెత్తబడి కావచ్చు కానీ మొత్తంమీద జిల్లాలో అత్యధికంగా వలంటీర్ల రాజీనామాలు చంద్రగిరి నియోజకవర్గంలోనే నమోదయ్యాయి. ఇక్కడ కేవలం సోమ, మంగళవారాల్లోనే వెయ్యి మందికి పైగా రాజీనామా చేసినట్టు సమాచారం. అయితే అవి ఇంకా అధికారికంగా ప్రకటితం కాలేదు. ఈ సంఖ్య రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశముంది. చంద్రగిరిలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా కూడా వలంటీర్ల రాజీనామాల సంఖ్య గణనీయంగా పెరగనుంది.

సార్వత్రికానికి సన్నద్ధం

- నేడు ఎన్నికల నోటిఫికేషన్
- నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు



కలెక్టరేట్‌లో నామినేషన్ల హెల్ప్‌డెస్క్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి (కలెక్టరేట్), ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారయంత్రాంగం సిద్ధమైంది.తిరుపతి పార్లమెంటుతో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మే 13న జరగబోయే ఎన్నికలకు గురువారం ఉదయం నోటిఫికేషన్ విడుదల కానుంది.ఉదయం 11గంటల నుంచి ఆయా నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు.సెలవు దినాలు మినహా ఈ నెల 25వ తేదీ వరకు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల లోపు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు ఆర్వోలకు సమర్పించాల్సి ఉంటుంది.నామినేషన్ కేంద్రాల్లో ప్రత్యేక హెల్ప్ డెస్కులు కూడా ఏర్పాటు చేశారు. నేడు దశమి, శుక్రవారం ఏకాదశి కావడంతో పలువురు అభ్యర్థులు ఈ రెండురోజుల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ రిటర్నింగ్ అధికారి హోదాలో కలెక్టరేట్ కార్యాలయంలోనే నామినేషన్ పత్రాలు స్వీకరించనున్నారు.గూడూరు నియోజకవర్గానికి సంబంధించి ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో అయిన ఆర్డీవో ఎం.కిరణ్‌కుమార్, సూళ్ళూరుపేట నియోజకవర్గానికి సంబంధించి తహసీల్దారు కార్యాలయంలో ఆర్వో అయిన ఆర్డీవో ఆర్.చంద్రముని నామినేషన్లు స్వీకరిస్తారు. వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి మున్సిపల్ ఆఫీస్‌లో ఆర్వో అయిన జేసీ ధ్యానచంద్ర, చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో అయిన ఆర్డీవో ఎ.నిషాంత్‌రెడ్డి, తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి ఆర్వో అయిన కార్పొరేషన్ కమిషనర్ ఆదితిసింగ్ అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించి ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో అయిన ఆర్డీవో ఎస్.రవిశంకర్‌రెడ్డి, సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించి తహసీల్దారు కార్యాలయంలో ఆర్వో అయిన ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు నామినేషన్లు స్వీకరిస్తారు.

ఆన్‌లైన్‌లోనూ నామినేషన్లు సమర్పించవచ్చు

ఆన్‌లైన్‌లోనూ నామినేషన్లు సమర్పించే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పించింది. సువిధ యాప్(పోర్టల్‌లో) ద్వారా నామినేషన్లు సమర్పించి తరువాత ఆయా పత్రాల కాపీలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది.

అభ్యర్థుల లెక్క పక్కా.. : ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ.95లక్షల వరకు ఖర్చు చేయడానికి అవకాశం ఉంది. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఎన్నికల ఖర్చును పరిగణనలోకి తీసుకుంటారు. 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరిస్తారు. 26న పరిశీలిస్తారు. ఉపసంహరణకు 29వ తేదీ వరకు అవకాశం ఉంటుంది.నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థి తన వెంట నలుగురిని మాత్రమే తీసుకెళ్లడానికి అనుమతి ఉంటుంది.ర్యాలీగా వస్తే కూడా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి కనీసం వంద మీటర్ల దూరంలోనే నిలిపివేయాల్సివుంటుంది.

ఒలంపిక్స్‌లో రాణించాలి



తిరుమల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రానున్న సింగపూర్ టోర్నమెంట్‌తో పాటు ఒలంపిక్స్‌లో బాగా రాణించాలని స్వామివారిని కోరుకున్నట్టు ప్రముఖ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి ఆమె దర్శించుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రానున్న టోర్నమెంట్స్‌లో బాగా ఆడాలని స్వామిని ప్రార్థించానన్నారు.బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి ఆమెకు ఈ సందర్భంగా బలరాముడి ప్రతిమను బహూకరించారు.

రూ.16.97 లక్షల సీజ్

- అదుపులో ముగ్గురు వ్యక్తులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17: సరైన ధ్రువపత్రాలు లేకుండా, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.16.97 లక్షలను అలిపిరి పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం సీజ్ చేశారు. సీఐ రామచంద్రారెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు జరిగాయి. కాటన్ మిల్లు వద్ద ప్రకాశం జిల్లాకు చెందిన ఒకరు ద్విచక్ర వాహనంలో రూ.12,98,500 తీసుకెళుతుండగా పట్టుకున్నారు. అలాగే మంగళం రోడ్డులోని డీమార్టు వద్ద అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.1.99 లక్షలు, తిరుపతి కేటీ రోడ్డులో రూ.2లక్షలు తీసుకెళుతుండగా సీజ్ చేశారు. ఈ నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించారు.

స్మగ్లర్ల ఆచూకీ సులభతరం

- శేషాచలం అడవుల్లో రియల్ టైమ్ మానిటరింగ్ కెమెరాల ఏర్పాటు
- ఎఫ్ఆర్వో మొబైల్‌కు క్షణాల్లోనే ఫొటోలు.. వీడియోలు





శేషాచల అడవుల్లో అమర్చిన రియల్ టైమ్ మానిటరింగ్ కెమెరాలు - సోలార్‌తో పనిచేసే కెమెరాలు

మంగళం, ఏప్రిల్ 17: శేషాచలం అడవుల్లో వన్యప్రాణులు, ఎర్రచందనం స్మగ్లర్ల ఆచూకీ ఇక సులభంగా కనిపెట్టేయవచ్చు. ఇందుకోసం అడవుల్లోని వివిధ ప్రాంతాల్లో అధునాతన టెక్నాలజీతో కూడిన బ్యాటరీతో పనిచేసే 20 రియల్ టైమ్ మానిటరింగ్ కెమెరాలను అటవీశాఖ ఏర్పాటు చేసింది. వీటితోపాటు సోలార్ విద్యుత్‌తో పనిచేసే 20 కెమెరాలను కూడా పెట్టారు. ఒక్కో కెమెరా విలువ దాదాపు రూ.40వేలు. వీటిల్లో 'రియల్ టైమ్' కెమెరాల ముందుకు వచ్చే ఏ వన్యప్రాణి లేదా మనుషులనైనా ఫొటోలుతో పాటు వీడియోలను తీసి కూడా క్షణాల్లోనే మొబైల్ కనెక్టివిటీ ఉన్న ఎఫ్ఆర్వోలకు పంపిస్తాయి.

గతంలో ఇలా.. : గతంలో ఏర్పాటు చేసిన కెమెరాలు కూడా ఫొటోలు తీసేవి. కానీ వాటి వద్ద ఏర్పాటు చేసిన చిప్పులోనే భద్రపరిచేవి. ఆ తర్వాత ఈ చిప్పును తీసుకుని కంప్యూటర్ల ద్వారా అధికారులు చూడాల్సి వచ్చేది. అప్పటికే సమయం మించిపోతుండేది.

తొలిసారిగా 'రియల్‌టైమ్' కెమెరాలు

శేషాచలం అడవుల్లో తొలిసారిగా రియల్ టైమ్ మానిటరింగ్ కెమెరాలు వినియోగిస్తున్నాం. సెల్‌ఫోన్ సిగ్నల్ ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. బ్యాటరీ సాయంతో పని చేసే వీటివల్ల వన్యప్రాణులు, ఎర్రచందనం స్మగ్లర్ల కదలికలు తెలుస్తాయి. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం. భవిష్యత్తులో మరిన్ని 'రియల్ టైమ్' కెమెరాలు ఏర్పాటు చేయబోతున్నాం.

- సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరావు

కోదండరాముడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గరుత్మంతుడి చిత్రపటాన్ని ఎగుర వేస్తున్న అర్చకులు

చంద్రగిరి, ఏప్రిల్ 17: చంద్రగిరిలోని కోదండరామాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 9.05 నుంచి 10 గంటల మధ్య మేష లగ్నంలో ధ్వజారోహణం ఘట్టాన్ని కంకణ బట్టర్ శ్రీనివాస బట్టర్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 26న ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించనున్నారు. అయితే 23న ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు ఆలయంలో కల్యాణోత్సవం వైభవంగా జరగనుంది. భక్తులు రూ.750 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, అర్చకులు శ్రీనివాసబట్టర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కళ్యాణం



భాకరాపేటలో నిర్వహిస్తున్న సీతారాముల కళ్యాణం

భాకరాపేట, ఏప్రిల్ 17: చిన్నగొట్టిగల్లు మండలంలోని భాకరాపేట, చిన్నగొట్టిగల్లులోని కోదండ రామస్వామి ఆలయాల్లో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కొటాల కోదండరామాలయంలో...




చంద్రగిరి, ఏప్రిల్ 17: కొటాల గ్రామంలోని కోదండరామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా బుధవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితులు డాక్టర్ తనూజ్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామంలోని దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నామినేషన్లకు అభ్యర్థితో పాటు
నలుగురికి మాత్రమే ప్రవేశం
- ఆర్వో నిషాంత్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 17: చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నామినేషన్లను గురువారం నుంచి స్వీకరించనున్నట్లు ఎన్నికల అధికారి (ఆర్వో), తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి తెలిపారు. దీనికోసం ఆర్డీవో కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అభ్యర్థితోపాటు నలుగురికి మాత్రమే ప్రవేశం ఉంటుందని చెప్పారు. రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల్లోపల మాత్రమే నామినేషన్ వేయాల్సి ఉంటుందన్నారు. ఈనెల 25వ తేదీ నాటికి 25 ఏళ్ల వయసు నిండినవారు మాత్రమే నామినేషన్ వేసేందుకు అర్హులని తెలిపారు.

త్వరలో టీడీపీలో చేరతా



చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదం అందిస్తున్న బడి సుధాయాదవ్

తిరుపతిరూరల్, ఏప్రిల్ 17: చంద్రగిరి టీడీపీ టికెట్ ఆశించి నిరాశ చెందిన రాష్ట్ర ఓబీసీ ఫోరం కన్వీనర్ బడి సుధాయాదవ్ బుధవారం హైదరాబాద్‌లో మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఇరువురి మధ్య జరిగిన సమావేశంలో కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో చంద్రగిరి టికెట్ కేటాయించలేకపోయామని, పులివర్తి నాని గెలుపునకు కృషి చేయాలని చంద్రబాబు సూచించారని ప్రకటించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గౌరవప్రదమైన స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారన్నారు. అలాగే రెండ్రోజుల కితం యువనేత నారా లోకేశ్‌తో కూడా భేటీ అయినట్లు తెలిపారు. మరో రెండుమూడు రోజుల్లో తన అనుచరులతో కలసి లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరుతానని ఆయన పేర్కొన్నారు.



రైల్వే కాలనీ కోదండ రామాలయంలో కల్యాణోత్సవం

వైభవంగా సీతారామ కల్యాణోత్సవం



పెద్దగోర్పాడు రామాలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ

పాకాల, ఏప్రిల్ 17: మండలంలోని పెద్దగోర్పాడు రామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే పాకాల రైల్వే కాలనీ కోదండ రామాలయంలోని ప్రత్యేక మండపంలో పురోహితుడు శాస్త్రోక్తంగా కళ్యాణం జరిపించారు. దామలచెరువు కోదండ రామాలయం, శంఖంపల్లె ఆంజనేయ స్వామి ఆలయాల్లో కల్యాణోత్సవాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాదాలు అందజేశారు.

ప్రజల కోసం పుట్టింది.. వంగవీటి కుటుంబం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని

చంద్రగిరి, ఏప్రిల్ 17: వంగవీటి కుటుంబం పదవుల కోసం పుట్టలేదని, ప్రజల కోసం పుట్టిందని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. బుధవారం చంద్రగిరి మండలం తొండవాడలోని ఓ ప్రైవేటు కల్యాణ మంటపంలో నాని ఆధ్వర్యంలో బలిజ కుటుంబ ఆత్మీయ సమావేశం జరిగింది. కాపు ఉద్యమ నేత వంగవీటి రంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు తిరుపతి రూరల్ సి.మల్లవరం జంక్షన్ నుంచి తొండవాడ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నాని మాట్లాడుతూ.. ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడిగా అన్ని వర్గాలకు పదవులు ఇచ్చానని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి గెలిచాక బలిజ, ఇతర కులాలకు పదవులు ఇవ్వలేదని, ఆయన కుటుంబీకులకు మాత్రం పదవులు కట్టబెట్టారని విమర్శించారు. వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ.. చేయి చేయి కలుపు.. చేజారదు గెలుపు అన్న తన తండ్రి వంగవీటి రంగా స్ఫూర్తితో ప్రజల కోసం రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ తరఫున ప్రచారం చేస్తున్నానని తెలిపారు. అందరూ ఐక్యంగా ఉండి.. ఉమ్మడి అభ్యర్థి పులివర్తి నానిని గెలిపించాలని కోరారు. ఈ ప్రాంతానికి ప్రజా తీర్పు కూటమి గెలుపు కావాలన్నారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, నాయకులు సింగంశెట్టి సుబ్బరామయ్య, బీజేపీ ఇన్‌చార్జ్ మేడసాని పురుషోత్తం నాయుడు, జనసేన నేత దేవర మనోహర్, టీడీపీ నాయకులు జేడీ జగన్, బెల్లంకొండ రమేష్‌రాయల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన రామినేని మునిరత్నం రాయల్



బైక్ ర్యాలీలో పులివర్తి నాని, కాపునేత వంగవీటి రాధాకృష్ణ తదితరులు

టీడీపీలో చేరిన బలిజ సంఘం నేత

బలిజ సంఘం రాష్ట్ర నాయకుడు రామినేని మునిరత్నం రాయల్ బుధవారం వంగవీటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈయనకు పులివర్తి నాని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మునిరత్నం రాయల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక బలిజలను ఆర్థికంగా, రాజకీయకంగా అణగదొక్కారని చెప్పారు. ఈ ఎన్నికలలో బలిజ సంఘం ఏకతాటిపై నిలిచి పులివర్తి నానీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకొంటామని తెలిపారు.

మ్యాంగో బోర్డు ఏర్పాటు చేస్తాం

- టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు

పాకాల, ఏప్రిల్ 17: మ్యాంగో బోర్డు ఏర్పాటు చేసి చేసి, మామిడి రైతులకు మద్దతు ధర కల్పిస్తామని టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు హామీ ఇచ్చారు. పాకాల మండలంలోని కమతంపల్లెలో బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానితో కలిసి గ్రామదేవతలను పూజించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆత్మ నిర్భర భారత్ పథకం కింద చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందించేలా చేస్తామన్నారు. పాకాల మండల అభివృద్ధికి చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించి స్థానికంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలో అన్ని వర్గాల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. వైసీపీ రాక్షస పాలన నుంచి విముక్తి చేయగల నాయకుడు చంద్రబాబు అని ప్రజలందరూ విశ్వసిస్తున్నారని, తమను ఆదరించి గెలిపించాలని కోరారు.



ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో బుధవారం టీడీపీలో చేరిన పేరూరు పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

మండలంలో బుధవారం పలువురు నాయకులు, కార్యకర్తలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కమతంపల్లెలో దగ్గుమళ్ల ప్రసాదరావు, పులివర్తి నానిల సమక్షంలో కమతంపల్లెకు చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వై.లింగయ్య నాయుడు, మాజీ సర్పంచ్ వై.జ్ఞానేశ్వరి, మాజీ ఎంపీటీసీ వి.వెంకటరమణ, జె.రత్నమ్మ, మునిప్రభాకర్, టి.అశోక్, ఎం.బాలాజీ, కరీంతుల్లాబాద్‌కు చెందిన సాయిసందీప్, యోగి, ధనుష్, రూపేష్, భానుప్రసన్న, మోహన్, ఖాదర్, హరికృష్ణ, భారతంమిట్టకు చెందిన డేరన్, లెనిన్, కరీంతుల్లాబాద్‌కు చెందిన ఇస్మాయిల్, అన్వర్, హరీష్, ఇర్ఫాన్, హాజహాన్, సద్దాం, మున్నా, అజీజ్ ఖాన్, అబుదాకర్, హంశాల్, దాస్, రహీద్, నాగూర్, ఫరీద్, మద్దినాయనిపల్లెకు చెందిన కిశోర్ రెడ్డి, చిట్టిబాబు, జనార్ధన్, కొత్తవడ్డిపల్లెకు చెందిన గణేష్, పరంధామ, రెడ్డిప్రసాద్, రెడ్డప్ప, మధు, నాగరాజు, నరసింహులు, హేమంత్, పూర్ణచంద్రలు పార్టీలో చేరారు. అలాగే గాదంకి బత్తినవారిపల్లెకు చెందిన తిరపతిరెడ్డి, బాలశేఖర్ రెడ్డి, తులసీకుమార్ రెడ్డి, బాలాజీ, టి.నరసింహారెడ్డి, జి.సుధాకర్ నాయుడులు టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



కమతంపల్లెలో పులివర్తి, దగ్గుమళ్లకు స్వాగతం పలుకుతున్న మహిళలు

తిరుపతి రూరల్: పేరూరు పంచాయతీకి చెందిన వైసీపీకి చెందిన 15 కుటుంబాలు బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పాకాలలో ప్రచారంలో ఉన్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో శ్రీనివాసులు, చిన్న, జ్ఞాన, వెంకీ, కార్తీక్, వినోద్, సూర్య, సుధీర్, అమర్, తేజ, హరికృష్ణ, ఆబలాజీరెడ్డి, జ్యోతికృష్ణారెడ్డి, వెంకటేష్ తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. రూరల్ మండల అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, ఏప్రిల్ 17: శ్రీరామనవమిని పురస్కరించుకుని తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో భరత కళాక్షేత్రం ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయనృత్యరూపకం నగరవాసులను అలరించింది. అన్నమయ్య కీర్తనలకు కళాకారులు శ్రీనివాస్, ధనశ్రీ, శ్రీనిధి, మనస్విని, లోలాక్షి తదితరులు చేసిన భరతనాట్యం ఆకట్టుకుంది. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

పాకాల, ఏప్రిల్ 17: ఎల్‌పీజీ గ్యాస్, ఎలక్ట్రికల్ ఉపకరణాల వినియోగంలో అప్రమత్తంగా వ్యవహరిస్తే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక అధికారి గుణశేఖర్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం అగ్నిప్రమాదాల నివారణపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. సిబ్బంది విశ్వనాథం, మనోహర్ రెడ్డి, రాజేంద్రబాబు, నాగార్జున, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు తెలియజేస్తున్న సిబ్బంది

రోజాకు.. ఎదురుగాలి!

- అసమ్మతి, అసంతృప్తితో ఉక్కిరిబిక్కిరి
- ప్రభుత్వ వ్యతిరేకతకు తోడైన స్వపక్షీయుల కాక
- మరోపక్క చేరికల సమరోత్సాహంతో టీడీపీ

రెండుసార్లు స్వల్ప తేడాతో ఓటమితో ఉన్న టీడీపీలో గెలవాలన్న కసి కనపడుతోంది. ఆ దిశగా అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. మరోవైపు పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న రోజా.. అసంతృప్తి, అసమ్మతులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికి ప్రభుత్వ వ్యతిరేకతా తోడవడంతో నియోజకవర్గంలో వైసీపీకి ఎదురు'గాలి' వీస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు.

- పుత్తూరు అర్బన్/ నగరి



గత ఎన్నికల్లో ఉన్న ఉత్సాహం వైసీపీ శ్రేణుల్లో ఈదఫా కనిపించడం లేదనే మాటలు వినబడుతున్నాయి. గత రెండు ఎన్నికల్లో బొటాబొటీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన రాష్ట్ర మంత్రి రోజా హ్యాట్రిక్ కోసం ఆశలు పెట్టుకున్నారు. అయితే రెండుసార్లు పోరాడి ఆమెను గెలిపించిన కీలక నాయకులు ఈసారి ముఖం చాటేస్తున్నారు. ఆమెకు వైసీపీ అభ్యర్థిత్వం దక్కకుండా అధిష్ఠానం వద్ద తుదివరకు పోరాటం చేసిన అసమ్మతి నాయకులు ప్రస్తుతానికి సైలెంట్‌గా ఉన్నా.. రోజాకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. నియోజకవర్గంలో మొదలియార్ ఓటర్లను ప్రభావితంచేసే వైసీపీ నాయకుడు ఏలుమలై మొదలియార్ (అమ్ములు), వడమాలపేట జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, క్షత్రియ సామాజికవర్గంలో పట్టున్న విజయపురానికి చెందిన లక్ష్మీపతిరాజు, పుత్తూరుకు చెందిన రవిశేఖర్‌రాజు, నింద్ర మండలం కొప్పేడు ఎంపీటీసీ సభ్యుడు రెడ్డివారి భాస్కర్‌రెడ్డి తదితరులు రోజాపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నట్లు సమాచారం. ఎన్నికల ప్రచారాన్ని కుటుంబసభ్యుల నెత్తిన పెట్టిన మంత్రి రోజా అలకలు తీర్చడం, బుజ్జగింపులు, సర్దుబాట్లతో బిజీగా గడిపేస్తున్నట్లు తెలుస్తోంది.

దూకుడు మీదున్న టీడీపీ

మరోవైపు టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ప్రచార పర్వంలో దూసుకెళుతున్నారు. ఏడాదిగా ఆయన వివిధ కార్యక్రమాలతో ప్రతి ఇంటికీ వెళ్తున్నారు. 'మీతో మీ తెలుగుదేశం', 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పుత్తూరులో ఇటీవల అధినేత చంద్రబాబునాయుడు పాల్గొన్న ప్రజాగళం సభ అంచనాలకు మించి సూపర్ సక్సెస్ కావడంతో టీడీపీ శ్రేణుల్లో జోష్ మరింత పెరిగింది. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి చేరే వారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతుండడం అనుకూల అంశంగా మారుతోంది. వైసీపీకి పట్టున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు, కార్యకర్తలను తనవైపు తిప్పుకోవడంలో గాలి భానుప్రకాష్ సఫలమయ్యారు. నామినేషన్ల పర్వం జోరందుకునే క్రమంలో వైసీపీ నుంచి కీలక నాయకుల చేరికలకు భానుప్రకాష్ స్కెచ్ వేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.



పెరిగిన వలసలు

గత రెండు ఎన్నికల్లో వైసీపీ గెలవడానికి ప్రధాన కారణమైన వడమాలపేట మండలంలో టీడీపీ అనూహ్యంగా పుంజుకొంది. టీసీ అగ్రహారం, తట్నేరి, కాయం పంచాయతీల్లో వైసీపీ నుంచి కీలక నాయకులు టీడీపీలో చేరారు. యాదవ సామాజికవర్గంలో పట్టున్న ఎస్‌బీఆర్ పురానికి చెందిన మాజీ సర్పంచ్ గెడ్డం సుబ్రమణ్యం యాదవ్, విజయపురం మండలంలో జగన్నాథపురం, కోసలనగరం, పాతార్కాడు పంచాయతీలకు చెందిన సోమశేఖర్, మునికృష్ణ, సర్పంచ్ నారాయణరాజు, పుత్తూరు మున్సిపాలిటీ తొలి చైర్మన్, దళితనాయకుడు అంకయ్య, అదే సామాజిక వర్గానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు భువనేశ్వరి, జాన్ కెనడీ, అంబేడ్కర్ ట్రస్ట్ భవనం కోశాధికారి, రిటైర్డ్ టీచర్ కుప్పయ్య, బలిజ సంఘం పూర్వ అధ్యక్షుడు, శివాలయం మాజీ చైర్మన్ జలకం సునీల్‌కుమార్, నగరికి చెందిన వైసీపీ నాయకుడు కేజే కుమార్ ముఖ్య అనుచరులైన శ్రీనివాసన్, నెడుంజయ్, దేశమ్మ దేవాలయం మాజీ చైర్మన్ బాబురెడ్డి, తడుకుపేటకు చెందిన మోహన్‌రావు తదితర నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

వైసీపీలో కాంగ్రెస్ కలవరం



మరోవైపు కాంగ్రెస్ కూడా రేసులోకి వస్తోంది. ఆ పార్టీ తరఫున పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి పోటీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నగరి, పుత్తూరులో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సభలను విజయవంతం చేయడంతో ఈ దఫా కాంగ్రెస్‌కు ఓట్లు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ పరిణామం కూడా వైసీపీ క్యాంపులో ఆందోళన కలిగిస్తోంది. నామినేషన్ల పర్వంతో నగరి రాజకీయం హాట్‌హాట్‌గా మారనుంది.



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది.

-భద్రాచలం



భక్తులకు జీలకర్రబెల్లం చూపుతున్న దృశ్యం

- కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు

లక్ష్మీపురం కూడలిలో వాహనదారుల ఇక్కట్లు



సర్కిల్ వద్ద మార్గాన్ని మూసేస్తూ పెట్టిన బారికేడ్లు

తిరుపతి(కొర్లగుంట), ఏప్రిల్ 17: లక్ష్మీపురం కూడలి వద్ద వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. శ్రీనివాససేతు నిర్మాణం సందర్భంగా ఈ కూడలి వద్ద ఉన్న వలయాన్ని తొలగించారు. తర్వాత వలయాన్ని నిర్మించకుండా రాకపోకలు జరిగేవి. దీనివల్ల ట్రాఫిక్ స్తంభిస్తోందని ఇక్కడ ఉన్న మార్గాన్ని బారికేడ్లతో పూర్తిగా మూసేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఎయిర్‌బైపాస్ రోడ్డు నుంచి తిరుచానూరు వైపు వెళ్లడానికి రామానుజ సర్కిల్ వద్దకెళ్లి యూటర్న్ తీసుకోవాల్సి వస్తోంది. అలాగే తిరుపతి బస్టాండు నుంచి వచ్చేవారు ఎయిర్ బైపాస్‌రోడ్డులోకి వెళ్లాలంటే పద్మావతి కల్యాణ మండపం వద్దకెళ్లి యూటర్న్ తీసుకోవాలి. దీనివల్ల వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. ఇకనైనా ఇక్కడ వలయం ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు సూచిస్తున్నారు. రోడ్లు వేసాం.. ఓట్లు వేయండని ఊదరగొడుతున్న ఎమ్మెల్యే, ప్రస్తుత అభ్యర్థికి నగరం నడిబొడ్డున ఈ సమస్య కానరావడం లేదా అని ప్రశ్నిస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.94 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.94 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించగా, రూ.2.94 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 67,294 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 22,765 మంది తలనీలాలు సమర్పించారు. కాగా, బుధవారం స్వామివారిని ఒంగోలు కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి దర్శించుకున్నారు.

నడకమార్గంలో అనధికార దుకాణాల తొలగింపు



దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

తిరుమల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలిన డకమార్గంలో నిబంధనలకు విరుద్ధంగా వెలసిన దుకాణాలను టీటీడీ అధికారులు బుధవారం తొలగించారు. అలిపిరి నడకమార్గంలో రాత్రికి రాత్రే దుకాణాలు ఏర్పాటు కావడం, ఓ బడా మంత్రి అనుచరులు వీటిని ఏర్పాటు చేసిన క్రమంలో గతంలో టీటీడీ లైసెన్సుదారుల మధ్య ఘర్షణలు, ఆందోళనలు జరిగిన విషయం తెలిసిందే. ఈక్రమంలో టీటీడీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీటీడీ రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు మంగళ, బుధవారాల్లో కాలినడకమార్గాల్లో తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. టీటీడీ అంగీకారం లేకుండా దుకాణాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఈకార్యక్రమంలో టీటీడీ రెవెన్యూ ఏఈవో భాస్కరనారాయణ చౌదరి, విజిలెన్స్ ఏవీఎస్వో శైలేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అడ్డుగా ఉందని పక్కన పెట్టేశాడు!



మంగళం, ఏప్రిల్ 17: తిరుపతికి స్వాగతం అనే బోర్డు తన వ్యాపారానికి అడ్డుగా ఉందని ఓ వ్యాపారి తొలగించేశాడు. తిరుపతి-కరకంబాడి రోడ్డులో భూపాల్ హౌసింగ్ కాలనీ ఎదురుగా నగర పాలకసంస్థ ఏర్పాటుచేసిన ఈ బోర్డును ఇలా పక్కన పెట్టేయడంపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.

కనుమరుగవుతున్న పరిశోధనాత్మక జర్నలిజం



సమావేశంలో ప్రసంగిస్తున్న భూమన్

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 17: సమాజంలో పరిశోధనాత్మక జర్నలిజం కనుమరుగవుతోందని టీటీడీ శ్వేత సంచాలకుడు భూమన్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో అక్షరానికి పట్టాభిషేకం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయికి వెళ్లి సంఘటన మూలాలను పరిశీలించి కథనాలు రాసే పాత్రికేయులు కనుమరుగయ్యారన్నారు. శ్వేత ఆధ్వర్యంలో జర్నలిస్టులకు వృత్తి నైపుణ్యంపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం 20మంది సీనియర్ పాత్రికేయులను కళావేదిక ద్వారా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళావేదిక ప్రధాన కార్యదర్శి అరవ జయపాల్, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

చంద్రగిరి, ఏప్రిల్ 17: చంద్రగిరి మండలంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. బుధవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో తొండవాడ పంచాయతీకి చెందిన మాజీ తిరుపతి గంగమ్మ ఆలయ చైర్మన్ రఘురామిరెడ్డి అల్లుడు, వైసీపీ కీలక నేత బొందు మహేష్ రెడ్డి, రామిరెడ్డిపల్లి పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ పూతలపట్టు సుబ్రమణ్యంయాదవ్, గొట్టిపాటి శ్రీహరి నాయుడు, కూచివారిపల్లెకు చెందిన చెంగల్‌రాయుడు, నాగేష్, శంకరమ్మ నాగయ్యగారిపల్లికి చెందిన వెంకటాద్రి నరసింగాపురం చెందిన మీసాలు కన్నయ్యయాదవ్, చేతన్ కుమార్, ప్రేమ్, గుణ, శేఖర్, గణి, విలోచ్, సుదీర్, కార్తీక్, వెంకటేష్ తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి పులివర్తి నాని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అందరికీ సముచిత స్థానం కల్పిస్తానని భరోసా ఇచ్చారు.

నానీని గెలిపించుకుందాం

రామచంద్రాపురం: చంద్రగిరి ఎమ్మెల్యేగా నానిని గెలిపించుకుందామంటూ టీడీపీ నాయకులు బుధవారం గణేశ్వరపురంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాలను గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మురళీనాయుడు, జయచంద్రనాయుడు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ



పాకాల, ఏప్రిల్ 17: మండలంలోని మద్దినాయనిపల్లె పంచాయతీ కోనేబోయన ఇండ్లు గ్రామానికి చెందిన పాకాల మండల మాజీ ఎంపీపీ ఆవుల లక్ష్మీకాంతమ్మతో పాటు 25 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని గ్రామంలో వీరికి పార్టీ కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఆవుల సురేంద్ర రాజేష్, చలపతి, రామ్మూర్తి, పురుషోత్తం, ప్రకాష్, రామయ్య, బి.సురేంద్ర, కోదండయ్య, మార్కొండయ్య, అశోక్ కుమార్, ఎల్లయ్య, నాగయ్య, భాస్కర్, మదన్‌మోహన్, వెంకట్రామయ్య, పి.మల్లయ్య, గోపి, వెంకటేష్‌రెడ్డి, ప్రసాద్, లక్ష్మయ్య, వెంకట్రామయ్య, వె.శంకరయ్య, నారాయణమూర్తి, శివశంకర్ తదితరులు టీడీపీలో చేరారు. పులివర్తినాని విజయానికి కృషిచేస్తామన్నారు. మండల టీడీపీ, జన సేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా పుత్రకామేష్టియాగం



రామచంద్రాపురం, ఏప్రిల్ 17: రాయలచెరువుకట్ట శ్రీశక్తిపీఠంలో వసంత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం పుత్రకామేష్టియాగం వైభవంగా జరిగింది. సాయంత్రం అమ్మవారి ఊంజల్ సేవ తర్వాత కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధిశ్వరి రమ్యానంద భారతిస్వామి భక్తులకు దేవీ వైభవాన్ని వివరించారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై ఆదాయ శాఖ డేగకన్ను

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎన్నికల వ్యయం, పంపకాలపై ఆదాయ పన్ను శాఖ డేగకన్ను ఉంచింది. గురువారం నోటిఫికేషన్ విడుదల అవుతున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఏయే పార్టీలు ఎంత ఖర్చు చేస్తాయి.. పంపకాలు ఏ మేరకు జరిగే అవకాశం ఉంది.. ఆ డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయి.. అందుకు సంబంధించి ఆదాయ పన్ను చెల్లించారా లేదా అనే విషయాలపై లోతుగా ఆరా తీయనున్నారు. ఇప్పటికే తిరుపతిలో దాదాపు రూ.60 లక్షల వరకు ఎన్నికల సమయంలో పోలీసులు సీజ్ చేసిన డబ్బును ఆదాయ పన్ను శాఖకు అప్పగించిన విషయం విదితమే. ఇందులో భాగంగా గురువారం నుంచి డబ్బుల పంపకాలు, స్టాకు పాయింట్లపై దృష్టి కేంద్రీకరించడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగనున్నాయి.

డాక్టరేట్ ప్రదానం



సువర్ణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 17: ఎస్వీయూ జువాలజీ పరిశోధకురాలు ఎ.సువర్ణ డాక్టరేట్ పొందారు. న్యూరో ప్రొటెక్టివ్ ప్రాపర్టీస్ ఆఫ్ సీవీడ్ ఆన్ డయాబెటీస్ ఇండ్యూస్డ్ అల్బినో ర్యాట్స్ అంశంపై ప్రొఫెసర్ కిషోర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

శేషాచల అడవుల్లో ఆరని మంటలు



దర్శనం ముగించుకుని వాహనాల్లో వెళుతున్న భక్తులు దూరంలో మండుతున్న అడవిని చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు.

తిరుమల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవుల్లో మంటలు వ్యాపిస్తూనే ఉన్నాయి. తిరుమలలో దాదాపు నాలుగు కిలోమీటర్లు దూరం, మొదటి ఘాట్‌కు సమీపంలోని సానరాళ్ల బండ ప్రాంతంలో మంగళవారం అడవికి నిప్పు అంటుకున్న విషయం తెలిసిందే. దట్టమైన అడవి కావడంతో టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్ సిబ్బంది మంటలను ఎంత అదుపుచేసే ప్రయత్నం చేసినా సాధ్యం కావడం లేదు. ఈ క్రమంలో బుధవారం కూడా మంటలు క్రమంగా వ్యాప్తిచెందుతూనే ఉన్నాయి. అయితే ఘాట్‌వైపుగా మంటలు రాకుండా అటవీ శాఖ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఎక్కడికక్కడ కాంటూర్స్ ఏర్పాటు చేయడంతో మంటలు రోడ్డువైపునకు రావనే అంచనా వేస్తున్నారు. మరోవైపు

అంతర్‌జిల్లా నేరస్తులు ముగ్గురి అరెస్టు

రూ.20 లక్షల నగల స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17: తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో బస్సులు, ఆటోల్లో ప్రయాణించే వారిని మాయమాటల్లోకి దించి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు పాత నేరస్తులను క్రైం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి దాదాపు రూ.20 లక్షలు విలువ చేసే 284 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. క్రైం సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాలకు చెందిన వేటి లక్ష్మి, నెల్లూరు జిల్లా రాపూరు సమీపంలోని ఇందిరా కాలనీకి చెందిన వనర్చి జ్యోతి, అదే ప్రాంతానికి చెందిన వనర్చి జాషువా కొన్ని నెలలుగా ఆర్టీసీ బస్టాండులు, దేవాలయాలు, మార్కెట్లు, ప్రజలు, యాత్రికులు ఎక్కువగా వున్న ప్రాంతాల్లో కాపు కాసి బస్సులు, ఆటోలు బయల్దేరే సమయాల్లో చేతిలో ఉన్న పర్సులు, విలువైన నగలు, ఇతర వస్తువులను క్షణాల్లో అపహరిస్తున్నారు. వీరిపై తిరుపతి క్రైం స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన క్రైం పోలీసులు నిందితుల కోసం తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు. తమకు అందిన సమాచారంతో సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐ సాయినాథ్ చౌదరి, సిబ్బంది కలసి అలిపిరి గరుడ వ్యూ పాయింట్ గెస్ట్ హౌస్ వద్ద అంతర్ జిల్లా నేరస్తులు ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బంగారు నగలు స్వాధీనం చేసుకుని, కేసునమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ప్రతి నెలా వేతనాలు చెల్లించండి



సీఎండీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తిరుపతి (ఆటోనగర్), ఏప్రిల్ 17: సదరన్ డిస్కం పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎండీ సంతోష్‌రావుకు ఏపీఎస్ఈబీ ఇంజనీరింగ్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం వారు సీఎండీని కలిశారు. నెల వారీగా చెల్లించే వేతనాలను అస్తవ్యస్తంగా ఇస్తున్నారని వివరించారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించే సందర్భంలో పర్సనల్ పేని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల ఏర్పాటైన కొత్త జిల్లాలకు అనుగుణంగా సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్.శామ్యూల్, నాగప్రసాద్, బాలాజి, రమేష్, జయప్రకాష్, నాగరాజు, మునస్వామి, బాషా, స్వాతి, వెంకటలక్ష్మి, భాస్కర్ నాయుడు, బాలాజి పాల్గొన్నారు.

ఎస్వీయూ దూరవిద్య పీజీ ఫలితాలు విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 17: ఎస్వీయూనివర్సిటీ పరిధిలో గతేడాది సెప్టెంబరులో నిర్వహించిన దూర విద్య పీజీ (ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ) మొదటి, ద్వితీయ సంవత్సర పరీక్షల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపర్చినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

భద్రాద్రి రాముడికి పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి రాముడికి టీటీడీ బుధవారం పట్టువస్త్రాలు సమర్పించింది. తెలంగాణలోని భద్రాచలంలో సీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవారికి శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పట్టువస్త్రాలు అందజేశారు. వీరికి భద్రాచలం ఆలయ ఈవో రమాదేవి స్వాగతం పలికారు. ప్రతి ఏడాది టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే.

ఆరణికి బి.ఫారం అందజేసిన పవన్



తిరుపతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరఫున తిరుపతి అసెంబ్లీ జనసేన పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఆరణి శ్రీనివాసులు బి.ఫారం అందుకున్నారు. బుధవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జనసేన అభ్యర్థులకు అధినేత పవన్ కల్యాణ్ బి.ఫారాలు అందజేశారు.

పేదలకు అల్పాహారం వితరణ

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 17: మెటర్నిటీ హాస్పిటల్ ఆవరణంలో బుధవారం శ్రీరామనవమిని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు అల్పాహారం వితరణ చేశారు. భాస్కర్, చక్రపాణి, ఈశ్వరయ్య, రోహిత్, కుమార్, జ్ఞానేశ్వర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సిలికా దోపిడీని అరికట్టమని కోరినా పట్టించుకోలేదు

జగన్‌పై తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు ధ్వజం



మధుసూదన్‌రెడ్డితో చర్చిస్తున్న వెలగపల్లి వరప్రసాద్‌రావు

చిట్టమూరు/వాకాడు, ఏప్రిల్ 17: చిల్లకూరు మండలంలో సిలికా దోపిడీకి గురవుతోందని ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోగా అక్కడే ఉన్న విజయసాయిరెడ్డి కల్పించుకొని సంఘటనా స్థలానికి ఎందుకు వెళ్లావని ప్రశ్నించారని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. బుధవారం చిట్ట మూరు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... విజయసాయిరెడ్డి తనను ప్రశ్నించిన సమయంలో అక్కడే ఉన్న అప్పటి మంత్రి బాలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి కల్పించుకొని నియోజకవర్గంలో సమస్యలను సీఎం దృష్టికి తెచ్చారంటే అర్థం చేసుకోవాలే కానీ ఎదురు ప్రశ్నించడం ఏమిటని అసహనం వ్యక్తం చేసినా సీఎం నోరు విప్పలేదన్నారు. వనరులన్నీ దోపిడీకి గురయ్యాయని, వేలాది కోట్ల రూపాయల ఇసుకను దోపిడీ చేశారని విమర్శించారు. ఇటువంటి ప్రభుత్వంలో ఉండలేక అవమానాలు భరించలేక బయటకు వచ్చానని చెప్పారు. అంతకుముందు గునపాటిపాళెం వెళ్లిన వరప్రసాద్ వైసీపీ నాయకుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొని బీజేపీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల కన్వీనర్ జి.కిషోర్‌నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు దువ్వూరు శరత్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు మింగేశారు...

కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు కేటాయించిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని, గ్రామాల్లో కనీస వసతులకు డబ్బులు లేని పరిస్థితి దాపురించిందని వరప్రసాదరావు అన్నారు. బుధవారం జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బి. ప్రమీల నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తీరప్రాంత గ్రామాలకు రోడ్డు వసతి, వన్యప్రాణి విభాగం పరిధిలో రోడ్ల నిర్మాణానికి తాను గెలిచిన వెంటనే అనుమతులు కోసం కేంద్రంలో సంప్రదింపులు జరిపి సాధించుకొస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు బీజేపీ నాయకులు పి.పురుషోత్తమరెడ్డి, టీడీపీ నాయకులు చిల్లకూరు దశరథ రామిరెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అక్కడి నుంచి ఆయన వైసీపీ రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి నందగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పార్టీలోకి ఆహ్వానించారు.

జనసేనలో జోష్

నగరంలో భారీ ర్యాలీ

ఆరణి విజయమే లక్ష్యమన్న పార్టీ శ్రేణులు





పాలకల మల్లికార్జున్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో జనసేన నేతలు డాక్టర్ పసుపులేటి, కిరణ్, ఆరణి జగన్ తదితరులు

తిరుపతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జనసేనలో కొత్త జోష్ కనిపించింది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో ఇటీవల జనసేన కండువా కప్పుకున్న తిరుపతి నగర కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పాలకల మల్లికార్జున్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో పెద్దఎత్తున ర్యాలీ జరిగింది. జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి ర్యాలీగా గాంధీ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ.. పాలకల మల్లి జనసేనలో చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. యువతలో తనకున్న ఛరిష్మాను మరోసారి నిరూపించుకున్నారని చెప్పారు. గతంలో చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో పాలకల క్రియాశీలకంగా పనిచేసి, ఆయన గెలుపులో కీలకపాత్ర పోషించారన్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో అతనికి గట్టి పట్టుందన్నారు. పాలకల మాట్లాడుతూ.. తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపే తమ లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. పవన్ ఆశయాలు రాష్ట్రానికి, తిరుపతికి ఎంతో అవసరమన్నారు. తిరుపతిలో వైసీపీ అభ్యర్థికి ఓటు వేస్తే స్థానికులు ఉండేందుకు ఇళ్లు కూడా మిగలవని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిరణ్ రాయల్, ఆరణి శ్రీనివాసులు కుమారుడు జగన్, రాజారెడ్డి, సుభాషిణి, కీర్తన, హరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి మార్గమే అనుసరణీయం




తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 17: శ్రీరాముడి మార్గం అన్ని కాలాల్లో అనుసరణీయమైనదని స్వామి శశికంఠానంద అన్నారు. తిరుపతి రామకృష్ణాశ్రమంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. కోల్‌కత్తాలోని బేలూరు మఠానికి చెందిన స్వామి శశికంఠానంద మాట్లాడుతూ.. శ్రీరామనవమి విశేషాలను వివరించారు. అంతకుముందు సంగీత ఉపాధ్యాయిని కణితి సోమేశ్వరి శ్రీరామకీర్తనలు గానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద, స్వామి సత్యస్థానంద, భక్తులు పాల్గొన్నారు.

రామాయణంపై అంతర్జాల సదస్సు

రామాయణం మనకు ఎన్నో సంస్కారాలను నేర్పుతుందని అపోలో హాస్పిటల్ అధినేత డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి అన్నారు. బుధవారం టీటీడీ, పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల తెలుగుశాఖ, సింగపూర్ తెలుగు సమాజం, దశరథరామ ఫౌండేషన్ సంయుక్తంగా రామాయణం నేర్పే సంస్కారాలు అనే అంశంపై అంతర్జాతీయ అంతర్జాల సదస్సు నిర్వహించాయి. టీటీడీ విద్యాశాఖాధికారి భాస్కర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణమ్మ, సింగపూర్ తెలుగు సమాజం పూర్వ అధ్యక్షులు కోటి రెడ్డి, ఉపన్యాసకులు హరినాథరెడ్డి, సదస్సు సంచాలకులు డాక్టర్ కృష్ణవేణి, మలేషియా, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి వివిధ దేశాల నుంచి పలువురు ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో 'నవమి' వేడుకలు



స్వామి, అమ్మవారికి హారతి

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 17: తిరుపతిలోని కోదండరామాలయంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఊంజల్ మండపంలో సీతారామలక్ష్మణ హనుమంత మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీరాముడు తన భక్తుడైన హనుమంత వాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందుచేశాడు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకులు ఏపీ ఆనందకుమార్ దీక్షితులు, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు. కాగా రాయలసీమ రంగస్థలి సభ్యులు బుధవారం స్థానిక నాలుగుకాళ్ల మండపంలోని హనుమంతుడి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు. గోపీనాథరెడ్డి, నగర సంకీర్తనామండలి సభ్యులు సురేష్‌స్వామి, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదాల పంపిణీ



తిరుపతి (విద్య): ఆపస్ కార్యాలయంలో శ్రీరామనవమి సందర్భంగా బుధవారం విద్యార్థులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ, ఆపస్ ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, జిల్లా సహాధ్యక్షులు డాక్టర్ దేవరాజులు, ఇతర నాయకులు వెంకటేశ్వర్లు, దాము, ప్రసాద్‌రాజు, సుభాష్, చంద్రదాస్ పాల్గొన్నారు.



అన్న 'ఫిగర్' చెప్పమన్నాడు



'అన్న పంపించాడు' అంటూ తమ దగ్గరకు వాళ్లు రాగానే తిరుపతి నగరంలోని వ్యాపారులు గడగడ వణికిపోతున్నారు. ఎన్నికల ఖర్చు భారీగా పెరిగిందంటూ వసూల్ రాజాలను తన తరపున రంగంలోకి దించారని చెబుతున్నారు. నగరంలోని రియల్టర్లు, బిల్డర్లు, విద్యాసంస్థలు, ఆస్పత్రులను వసూల్ రాజాలు టార్గెట్‌గా చేసుకున్నారు. తిరుపతిలో పేరు మోసిన ఒక బిల్డర్‌కు కోటి రూపాయలు 'ఫిగర్' చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. హమ్మో.. కోటా? అని అతను ఆందోళన పడుతూ ఉంటే, మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో జరిగిన మేళ్లను వివరించి, భవిష్యత్తులో దున్నేసుకోవచ్చని భరోసా ఇచ్చారని తెలిసింది. ఆసుపత్రులకు అయితే, స్థాయిని బట్టి 'ఫిగర్' నిర్ణయించారు. హోటళ్లనూ ఊడ్చేస్తున్నారని అంటున్నారు. పార్టీ ఫండ్ పేరుతో కొనసాగుతున్న వసూళ్ల పర్వం ఇప్పుడు చర్చగా మారుతోంది. విశేషం ఏమిటంటే.. ఇలా వసూళ్లకు పంపే చోటా నేతలకు కమీషన్లు కూడా ఇస్తున్నారని చెప్పుకుంటున్నారు. దీంతో అన్న అనుచరగణం కొరడాలు బయటకు తీసి రంగంలోకి దిగుతున్నారని తెలిసి, కొందరు బిల్డర్‌లు సమ్మర్ ట్రిప్‌లకు చెక్కేస్తున్నట్టు తెలిసింది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

లీకులు...కాసులు



ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడబ్బా నాలుగు రాళ్లు ఎనకుసుకునేది.. అనుకుంటున్నారు వైసీపీ నాయకులు. నిజమే పాపం జగన్‌ను పీఠం ఎక్కించాక పథకాలకు తప్ప పనులకు పైసా ఇవ్వకపాయ. కాంట్రాక్టులు చేసుకుని నాలుగు కాసులు మిగుల్చుకునే ఆవకాశం రాకపాయ. అందుకే ఎన్నికల రోజుల్లో చిత్రమైన ఎత్తుగడ వేస్తున్నారు. ఇటీవల వడమాలపేటకు చెందిన ఇద్దరు వైసీపీ నాయకులు పార్టీ మారబోతున్నారనే ప్రచారం జరిగింది. దాంతో వైసీపీ పెద్దలు రంగంలోకి గబీమని దూకేశారు. ఇట్టాంటి వేళ ఇదేమి సామీ అని చెరో రెండు లక్షలు చేతల్లో పెట్టి సర్దేసినట్లు ప్రచారం జరుగుతోంది. నిజానికి వాళ్లకి పార్టీ మారే ఆలోచన లేదు. కావాలనే సోషల్ మీడియాకు టీడీపీలో చేరుతున్నట్టు లీకులు ఇచ్చారంట. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో కూడా ఇదే విధంగా కొందరు లీకులిచ్చి కాసులు రాబట్టుకున్నట్టు చెబుతున్నారు. ఇది చూసి పార్టీ మారబోతుండారంటూ లీకులు ప్రచారం చేసుకునే వాళ్ల సంఖ్య పెరిగింది. నిజమేదో, అబద్ధమేదో తెలీక పాపం నాయకులు జేబులు ఖాళీ చేసుకోక తప్పడం లేదు అని చెప్పుకుని జనం నవ్వుకుంటున్నారు.

- పుత్తూరు అర్బన్

పెద్ద నోటు... ఈసారి లోటు



ఎన్నికలొచ్చాయంటే నగదు, మద్యందే కీలక భూమిక. నోటిఫికేషన్ మొదలు ఓటరు పోలింగ్ కేంద్రానికి వెళ్లేవరకూ ఈ రెండే ప్రభావం చూపిస్తుంటాయి. ఓటర్లను దారిలోకి తెచ్చుకోవాలన్నా, ఫిరాయింపులు అడ్డుకోవాలన్నా వీటి అవసరం అంతాఇంతా కాదు. జేబులో చేయి పెట్టి నోటు తీస్తే కట్టంతా ఇవ్వాలని అడిగే రోజులివి. అభ్యర్థుల అదృష్టమో.. ఓటరు దురదృష్టమో తెలియదు గానీ గడచిన రెండు ఎన్నికల్లోనూ పెద్ద నోట్లు కనిపించకుండా పోయాయి. 2014 సాధారణ ఎన్నికల్లో పెద్ద నోటు అంటే 1000 ఒక్కటే. ఆ తర్వాత నోట్ల రద్దుతో వెయ్యి నోటు అడ్రస్ లేకుండా పోయింది. 2019 ఎన్నికల తర్వాత రూ. 2000 నోటు వచ్చింది. ఇప్పుడు ఆ నోటూ కనిపించడంలేదు. జేబులోకి చెయ్యిపోనిస్తే 500 నోటు లేదా 200 నోటు పెద్దవిగా కనిపిస్తున్నాయి. ఓటరుకైనా నాయకుడికైనా ఇచ్చే పెద్ద నోటు ప్రస్తుతానికి ఇదే.. అలాగని ఒకటో రెండో నోట్లిచ్చినా ఓటరు సంతృప్తి పడే రోజులు పోయాయని అభ్యర్థులు ఇప్పుడు పెద్ద నోట్ల వేటలో పడ్డారు.

- డక్కిలి

సత్యవేడులో గెలిచే పార్టీదే అధికారం

● సెంటిమెంట్

సత్యవేడులో గెలిచే పార్టీ రాష్ట్రంలో అధికారం చేపడుతుందని ఒక నమ్మకం. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ఆవిర్భావం తరువాత 2009 ఎన్నికలు మినహా మిగతా అన్ని ఎన్నికల్లోను ఇదే జరిగింది. 1983లో టీడీపీ అభ్యర్థి తలారి మనోహర్ గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టింది. 1985లో మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎం.స్వరాజన్ గెలుపొందగా టీడీపీదే అధికారం. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సి.దాసు గెలుపొందగా కాంగ్రెస్ అధికారం చేపట్టింది. 1994లో టీడీపీ అభ్యర్థి ఎం.స్వరాజన్ గెలుపొందగా టీడీపీ అధికారంలోకి వచ్చింది. 1999లో టీడీపీ అభ్యర్థి శివప్రసాద్ గెలుపొందగా టీడీపీ అధికారంలో ఉంది. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి నారాయణస్వామి గెలుపొందగా అప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది. 2009లో మాత్రం టీడీపీ అభ్యర్థి హేమలత గెలుపొందినీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టింది. 2014లో టీడీపీ అభ్యర్థి తలారి ఆదిత్య గెలుపొందగా టీడీపీ అధికారంలో ఉంది. 2019లో వైసీపీ అభ్యర్థి ఆదిమూలం గెలుపొందగా వైసీపీ అధికారం చేపట్టింది.

- సత్యవేడు

మాట తప్పడు, మడమ తిప్పడు
నేను వున్నాను, నేను విన్నాను
విలువలు, విశ్వసనీయత
చెప్పాడంటే.. చేస్తాడంతే

.. 'ఒక్క ఛాన్సు' అంటూ 2018 పాదయాత్ర.. 2019 ఎన్నికల ప్రచారాల్లో విపక్ష నేతగా జగన్ హామీలిస్తూ చెప్పిన మాటలివి. వీటిని నమ్మి ప్రజలు ఒక్క అవకాశం ఇచ్చారు. మరి.. ముఖ్యమంత్రిగా ఆయన ఐదేళ్లలో తిరుపతి జిల్లాకు సంబంధించి నాటి హామీలేవీ నెరవేర్చలేదు. 'చెప్పాడంటే చేయడంతే' అన్నట్లుగా వ్యవహరించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి




బాలాజీ రిజర్వాయరు నిర్మాణంలో భాగంగా చంద్రబాబు హయాంలో నిర్మించిన రాతి కట్ట

ఇంకా ఆరు నెలలు కాలేదా?

● గాలేరు- నగరి ప్రాజెక్టుకు నీళ్లొదిలేసిన జగన్ ● టెండర్లు రద్దు.. ప్రత్యామ్నాయ ప్రతిపాదనలతో సరి

అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో గాలేరు-నగరి ప్రాజెక్టును పూర్తి చేస్తా.

- 2018 జనవరి 6న సదుంలో, 16వ తేదీన వడమాలపేటలో పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీ.



ప్రాజెక్టు నేపథ్యం

రాయలసీమ కరువు నివారణకు దివంగత ఎన్టీ రామారావు సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపాదించిన ప్రాజెక్టుల్లో గాలేరు-నగరి ఒకటి. ఈ ప్రాజెక్టు రెండో దశలో 8 నుంచి 14 వరకు.. ఏడు ప్యాకేజీలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించినవి.

ప్రయోజనం కలిగే ప్రాంతాలు

తిరుపతి రూరల్, రామచంద్రాపురం, వడమాలపేట, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, కేవీబీపురం, పిచ్చాటూరు, నాగలాపురం, నింద్ర, విజయపురం, పుత్తూరు, నగరి, నారాయణవనం తదితర 14 మండలాలు. ఈ ప్రాంతంలోని 1.035 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి.

'కాంగ్రెస్' హయాంలో అనుమతులతో సరి

ఉమ్మడి కడప జిల్లా నుంచి శేషాచల పర్వతాలలో రెండు చోట్ల టన్నెళ్లు తవ్వాలి. మొదటి టన్నెల్ ద్వారా రేణిగుంట మండలం బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని చేర్చాలి. అక్కడ్నుంచి మల్లిమడుగు.. ఆపై పద్మసాగర్, శ్రీనివాస సాగర్, వేణుగోపాల సాగర్, వేపగుంట, అడవి కొత్తూరు రిజర్వాయర్లను నింపాలి.దీనికోసం మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం పెంచాలి. మిగిలినవి కొత్తగా నిర్మించాలి. రెండు టన్నెళ్లతో కూడిన 94 కిలోమీటర్ల ప్రధాన కాలువ, ఏడు రిజర్వాయర్ల నిర్మాణానికి 2005లో రూ.2189 కోట్ల అంచనాతో అప్పటి ప్రభుత్వం పనులు మంజూరు చేసింది. ఆ అంచనాలను 2008లో రూ.2526 కోట్లకు సవరించింది. వీటికి అనుమతి వచ్చిందే గానీ.. ఆరేళ్ల పాటు పనులు మొదలు కాలేదు.



బాలాజీ రిజర్వాయర్ వద్ద ఈ కాలువ తవ్వింది టీడీపీ హయాంలోనే

చంద్రబాబు వచ్చాక పరుగులు

2014లో చంద్రబాబు సీఎం కాగానే రూ.2526 కోట్లతో ఈ ప్రాజెక్టుకు టెండర్లు పిలిచారు. పద్మసాగర్, శ్రీనివాస సాగర్ రిజర్వాయర్లకు ప్రైవేటు భూముల సేకరణ ముగిసింది. బాలాజీ రిజర్వాయర్ కట్ట.. అక్కడ్నుంచి మల్లిమడుగు రిజర్వాయరు వరకు కాలువ తవ్వకం పనులు మొదలయ్యాయి. మల్లిమడుగు సామర్థ్యాన్ని 0.18 టీఎంసీల నుంచి 2.65 టీఎంసీలకు పెంచేందుకు రూ.56.08 కోట్లతో పనులు మొదలు పెట్టి.. రూ.25 కోట్లు ఖర్చుపెట్టారు. రూ.160 కోట్ల అంచనాతో మొదలు పెట్టిన వేణుగోపాల సాగర్‌కూ రూ.35 కోట్ల మేరకు పనులు జరిగాయి. కాలువ సహా వేపగుంట సాగర్, అడవికొత్తూరు రిజర్వాయర్ల అంచనా వ్యయం రూ. 129.8 కోట్లు కాగా, ఇందులో 75 శాతం పనులు పూర్తయ్యాయి. టన్నెళ్ళ నిర్మాణానికి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు రాకపోవడంతో పెండింగులో పడ్డాయి. మిగిలిన రిజర్వాయర్ల నిర్మాణానికి భూసేకరణలో అటవీ శాఖ నుంచీ అనుమతులు రావాల్సి ఉంది.

నాడు శివాలెత్తి.. నేడు నోరెత్తని వైసీపీ నేతలు

వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. గాలేరు- నగరి ప్రాజెక్టు రెండో దశ పనుల కోసం నగరి ఎమ్మెల్యే రోజా ఆందోళన నడిపారు. ఈ ప్రాజెక్టు వల్ల శ్రీకాళహస్తి నియోజకవర్గానికీ లబ్ధి ఉంది. అందుకని ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు అప్పట్లో వైసీపీ నేత బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆందోళనలు చేపట్టారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి కూడా గట్టిగా నినదించారు. తద్వారా 2019 ఎన్నికల్లో ఈ ముగ్గురూ ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరిలో రోజా మంత్రిగాను.. కరుణాకరరెడ్డి టీటీడీ ఛైర్మన్‌గానూ జిల్లాలో బలమైన అధికార కేంద్రంగా మారారు. మధుసూదన్‌రెడ్డి సీఎం జగన్‌కు సన్నిహితులు. ఇక, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఉన్న పలుకుబడి చెప్పక్కర్లేదు. ఇలా ప్రాజెక్టు కోసం నాడు ఆందోళన చేసిన వారు.. మిగతా ప్రజాప్రతినిధులూ ఐదేళ్లుగా నోరు మెదపడంలేదు.



పనులు ఆగిపోవడంతో తుప్పుపట్టిన కాంట్రాక్టు సంస్థ వాహనాలు

జగన్ ఏం చేశారంటే..

అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది పట్టించుకోలేదు.ఆ తర్వాత రూ.2500 కోట్ల విలువైన ప్రాజెక్టు పనుల టెండర్లను అర్ధంతరంగా రద్దు చేశారు. ఆ తర్వాత ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్పు పేరిట రూ.5013 కోట్ల అంచనాతో 2021 ఆగస్టులో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. వీటికీ రెండున్నరేళ్లుగా అనుమతులు ఇవ్వలేదు. రద్దు చేసిన టెండర్ల స్థానంలో ఇంతవరకు రీ టెండర్లూ పిలవలేదు. ఒక్క రూపాయీ ఖర్చు పెట్టలేదు. బాలాజీ రిజర్వాయర్ సైట్ వద్ద కాంట్రాక్టు సంస్థ నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకోగా.. వాహనాలన్నీ తుప్పుపట్టిపోయాయి.

ఇదీ ఐదేళ్లలో సీఎం జగన్ సాధించిన 'గాలేరు- నగరి' ప్రాజెక్టు పురోగతి.

● వర్తమానం

చంద్రగిరి సీను మారింది





వైసీపీ అభ్యర్థికీ సీనియర్ నేతలకూ నడుమ అంతరం

పెరుగుతున్న టీడీపీ గ్రాఫ్

చెవిరెడ్డి దూరమైన లోటు స్పష్టం

చంద్రబాబు స్వస్థలం... చెవిరెడ్డి వైవిధ్య రాజకీయం... వెరసి చంద్రగిరి నియోజకవర్గం రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. కానుకలు, సాయాల భారీ ఖర్చుతో నిరంతరం జనం మెప్పుకోసం ప్రయత్నించిన చెవిరెడ్డి అనూహ్యంగా తప్పుకోవడంతో నియోజకవర్గంలో పరిస్థితులు తారుమారు అయ్యాయి. తొలిసారి శాసనసభ బరిలోకి దిగుతున్న తనయుడు మోహిత్‌రెడ్డిని దగ్గరుండి గెలిపించుకునే అవకాశం చెవిరెడ్డి ఒంగోలు ఎంపీగా ఆయన పోటీ చేయాల్సిన అనివార్యతతో కోల్పోయారు. ఈ పరిణామాలన్నీ టీడీపీ అభ్యర్థిగా మరోమారు బరిలోకి దిగుతున్న పులివర్తి నానీకి కలిసివచ్చాయి. ఆయన గ్రాఫ్ విపరీతంగా పెరుగుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీలో పెరిగిపోతున్న అసంతృప్తి

చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ శ్రేణుల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. గత ఎన్నికల్లో శక్తికి మించి పనిచేసినా నిరాదరణకు గురయ్యామని వీరు ఆవేదనతో ఉన్నారు. చెవిరెడ్డి నియోజకవర్గంలో ఉన్నంతకాలం దీనిని దాచుకున్న వీరంతా ఇప్పుడు బయటపడుతున్నారు. పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారు. గత ఐదేళ్ళలో పనులు జరగకపోవడం, ఆదాయం లేకపోవడం, గుర్తింపు గానీ, పదవులు గానీ దక్కకపోవడం వంటివి కారణమవుతోంది. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పోటీ నుంచి తప్పుకున్నప్పటి నుంచే పట్టు సడలుతూ వచ్చింది. ఎక్కువ కాలం తాడేపల్లిలో వుంటూ శ్రేణులకు అందుబాటులో లేకుండా పోయారు. మోహిత్‌రెడ్డి వయసు తక్కువ కావడం, తొలిసారి పోటీ చేస్తుండడంతో అతని కంటే వయసులో పెద్దవారు, సీనియర్లు చొరవగా కలవలేకపోతున్నారు. దీంతో అభ్యర్థికీ, సీనియర్ నాయకులూ కార్యకర్తలకూ నడుమ అంతరం పెరిగింది. ఒంగోలుతోనే సతమతం అవుతున్న చెవిరెడ్డి చంద్రగిరిమీద ఇప్పట్లో దృష్టిపెట్టే అవకాశం లేదని తేలిపోయాక పార్టీ నీరసపడింది.

టీడీపీలోకి వలసలు

నియోజకవర్గంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట వైసీపీ నుంచీ పెద్ద ఎత్తున కార్యకర్తలు, గ్రామ స్థాయి నాయకులు టీడీపీలో చేరుతున్నారు. మండల స్థాయిలో ప్రభావం చూపగలిగిన పలువురు నాయకులు వీరిలో ఉండడం విశేషం. చంద్రగిరి మండలం మాజీ జడ్పీటీసీ సరిత భర్త రమణమూర్తి, చంద్రగిరి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి , పాకాల జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఆమె భర్త బాబురెడ్డిలు, చిన్నగొట్టిగల్లులో వైస్ ఎంపీపీ సునీత, భర్త దామోదర్, రామచంద్రాపురం మండల నేత నీలకంఠ చౌదరి తదితరులు వైసీపీ వీడి టీడీపీలో చేరారు. ఈ పరిణామాలు వైసీపీని గణనీయంగా నష్టపరుస్తున్నాయి.

కాంగ్రెస్‌తో వైసీపీకి నష్టమే!

ఇక చంద్రగిరి నుంచీ ఆర్ఎంపీ వైద్యుడు వాసు కాంగ్రెస్ అభ్యర్థిగా రెండవసారి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత కంచన వేణుగోపాల్‌రెడ్డి కనుక గట్టిగా పనిచేస్తే ఆ మేరకు వైసీపీకి నష్టం కలిగే అవకాశముంది. వేణుగోపాల్‌రెడ్డికి ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో పట్టుంది. ఆయన పట్టుదలగా కాంగ్రెస్ అభ్యర్థి కోసం రంగంలోకి దిగితే ఈ రెండు మండలాల్లో వైసీపీ ఓట్లు గణనీయంగా చీల్చగలరు.

పుంజుకుంటున్న పులివర్తి నాని

టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ, ఆయన సతీమణి సుధారెడ్డి, కుమారుడు వినీల్... ముగ్గురూ తలోవేపు నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. నానీ గత ఎన్నికల్లో ఓడిపోయాడన్న సానుభూతి జనంలో కనిపిస్తోంది. నిదానంగా టీడీపీ బలం పుంజుకుంటున్న దృశ్యం కనిపిస్తోంది. ఇటీవల ప్రముఖ రియల్టర్ డాలర్స్ దివాకర్‌రెడ్డి కూడా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. నానీని గెలిపిస్తే చంద్రగిరి అభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో పలుచోట్ల ప్రకటించారు. మరోవైపు జనసేన, బీజేపీ పార్టీలు తమ పరిధిలో పూర్తి స్థాయిలో టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నాయి. తాజాగా బుధవారం వంగవీటి రాధా చంద్రగిరికి వచ్చి బలిజ సామాజికవర్గంతో సమావేశమై ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థుల విజయానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. సమావేశానికి వేలాదిగా బలిజలు హాజరు కావడం చూస్తే ఆ సామాజికవర్గం కూడా గణనీయమైన స్థాయిలో టీడీపీకి మద్దతిస్తున్నట్టు భావించాల్సి వస్తోంది. ఈ అంశాలన్నీ టీడీపీకి సానుకూలతలను పెంచుతున్నాయి.



ఇంటి నుంచే ఓటు

- 32,421మందికి అవకాశం
- దివ్యాంగులు, 85 ఏళ్లు దాటినవారికి పోస్టల్ బ్యాలెట్
- ఫారం-12డీ ద్వారా దరఖాస్తు చేసుకుంటే చాలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 17: దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఇటువంటి వారు జిల్లాలో 32,421మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరంతా ఎన్నికల అధికారులకు 12డీ దరఖాస్తు చేసుకుంటే ఈ సౌలభ్యం కల్పిస్తారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 17,94,733 మంది (పురుషులు 8,74,738మంది, మహిళలు 9,19,817మంది) ఓటర్లు ఉన్నారు. వీరిలో.. దివ్యాంగ ఓటర్లు 24,481 మంది, 85 సంవత్సరాలు దాటినవారు 7,940మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులోనూ వందేళ్లు పైబడిన వారు 20మంది ఉన్నారు. వీరికి ఇంటి నుంచే ఓటు వేయడంపై అవగాహన కల్పించడానికి హోం ఓటింగ్ నోడల్ అధికారిగా భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమల్లీశ్వరరావును జిల్లా ఎన్నికల అధికారి నియమించారు.

దరఖాస్తు చేయడమిలా..

అర్హులైన దివ్యాంగులు, వృద్ధుల ఇంటికే వెళ్లి ఫారం- 12డీని ఎన్నికల అధికారులు అందజేస్తారు. ఈ ఫారాన్ని పూర్తి చేసి బీఎల్వోలకు ఇస్తే.. వారు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేస్తారు. దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాకే అర్హులైన ఓటర్ల ఇంటికి పోస్టల్ బ్యాలెట్‌ను పంపుతారు. వీరిలో ఎవరైనా తాము పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేస్తామని చెబితే ఫారం-12డీ ఇవ్వరు.

రహస్య పద్ధతిలోనే ఓటింగ్

ఓటర్ల నివాసానికి ఎన్నికల సిబ్బంది వ్యాన్‌లో చేరుకుంటారు. ఇద్దరు పోలింగ్ అధికారులు, ఓ వీడియోగ్రాఫర్, పోలీస్‌శాఖ నుంచి ఒకరుంటారు. అక్కడ ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. అధికారులు నిర్దేశించిన పోలింగ్ కంపార్ట్‌మెంట్‌లో రహస్యంగా ఓటు వేసి, దాన్ని బ్యాలెట్‌బాక్సులో ఓటరు వేసేలా చర్యలు తీసుకుంటారు. ఎవరికి ఓటు వేశారన్న విషయాన్ని తప్ప, మిగిలిన ప్రక్రియనంతా అధికారులు చిత్రీకరిస్తారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17: శ్రీకాళహస్తి శాసనసభకు పోటీ చేసే అభ్యర్థులతో గురువారం నుంచి నామినేషన్లు స్వీకరించినట్లు ఆర్డీవో రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ కేంద్రం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థితో పాటు ఐదుగురిని కార్యాలయంలోకి అనుమతిస్తామని చెప్పారు. అభ్యర్థుల ర్యాలీ, ప్రచారాలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని తెలిపారు.

నేడు సుధీర్ రెడ్డి నామినేషన్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17: శ్రీకాళహస్తి ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేయమన్నారు. ఉదయం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో కొలువైన గణనాథుడికి పూజలు నిర్వహిస్తారు. అక్కడ నుంచి బీపీ అగ్రహారం, సూపర్ బజార్ కూడలి, పెళ్లి మండపం, బేరివారి మండపం, ముక్కంటి ఆలయం సన్నిధి వీధి, జలవినాయకుడి కూడలి, పొన్నాలమ్మ గుడి వరకూ కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించనున్నారు.

మహిళను మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఏర్పేడు, ఏప్రిల్ 17: ఓ మహిళను పెళ్లి చేసుకుని కొద్ది రోజులు కాపురం చేసి వదిలేసిన వెంకటరమణ అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు.. అనంతపురం జిల్లా బుక్కరాయకొండ గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణమ్మ తిరుపతి విమానాశ్రయం సమీపంలో ఉన్న ఓ కర్మాగారంలో పనిచేస్తోంది. ఆమెకు ఏర్పేడు మండలం బండివానిపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణతో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఒకరినొకరు ఇష్టపడి రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. తిరుపతి పట్టణం కొర్లగుంట వద్ద సంజయ్‌గాంధీ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇటీవల వెంకటరమణకు పెళ్లి చేయడానికి అతని తల్లిదండ్రులు సంబంధాలు చూశారు. ఈ విషయం తెలుసుకున్న లక్ష్మీనారాయణమ్మ తన భర్త వెంకటరమణను నిలదీసింది. కట్నం ఎక్కువ ఇస్తే కాపురం చేస్తానని, లేకుంటే తన తల్లిదండ్రులు చూసిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని వెంకటరమణ చెప్పాడు. దీంతో లక్ష్మీనారాయణమ్మ బుధవారం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కండక్టర్ ఇంట్లో చోరీ

నారాయణవనం, ఏప్రిల్ 17: నారాయణవనంలోని దిగువ పద్మశాలి వీధిలో నివాసం ఉంటున్న ఆర్టీసీ కండక్టర్ రూపేష్ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు.. ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్న రూపేష్ మంగళవారం నగరి మండలం మాంగాడు గ్రామంలో జరిగిన గంగజాతర వేడుకలకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం తిరిగి ఇంటికి చేరుకోగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న తొమ్మిది సవర్ల బంగారు, 400 గ్రాముల వెండి, రూ.6 వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ భాస్కర్‌నాయక్, ఎస్ఐ లక్ష్మీనారాయణ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శేష వాహనంపై అగస్తీశ్వరస్వామి

నారాయణవనం, ఏప్రిల్ 17: మండలంలోని సముదాయం గ్రామంలో ఉన్న మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారిని శేష వాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామివారికి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతరప్రాకరంలో ఊరేగించారు. సాయంత్రం విశేష పూజలనంతరం, మేళతాళలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారిని హంస వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగించారు.

యువతి అదృశ్యం

ఏర్పేడు, ఏప్రిల్ 17: ఏర్పేడు మండలం పంగూరు గిరిజన కాలనీకి చెందిన యువతి(17) రెండు రోజుల నుంచి కనిపించడంలేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 15 నుంచి తమ కుమార్తె కనిపించడం లేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు.

రాములవారి ఉత్సవంలో
వైసీపీ నేత వీరంగం
టీడీపీ కార్యకర్తపై దాడి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17: పట్టణం లోని బీపీ అగ్రహారం ప్రాంతంలో బుధవారం రాములవారి ఉత్సవంలో రాజకీయ రగడ చోటు చేసుకుంది. శ్రీరామ నవమి పర్వదినం కావడంతో ఓ కుల సంఘానికి డైరెక్టర్‌గా ఉన్న వైసీపీ నాయకుడు మరో నాయకుడితో కలిసి రాములవారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో అమ్మవారి ఆలయం వద్ద ఆగి పూజలు చేశారు. ఇక్కడ ఎందుకు ఆగారంటూ ఓ టీడీపీ కార్యకర్త ప్రశ్నించారు. ఆగ్రహానికి గురైన కుల సంఘ డైరెక్టర్ టీడీపీ కార్యకర్తపై దాడి చేశాడు. చేతి వేలికి ఉన్న ఉంగరం ముఖంపై తగలడంతో టీడీపీ కార్యకర్తకు ముఖంపై రక్త గాయం అయింది. చికిత్స నిమిత్తం కార్యకర్త ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తారన్న అనుమానంతో వైసీపీ నాయకుడు ముందుగానే ప్రతిదాడి జరిగినట్లు ఫిర్యాదు చేసేందుకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఎన్నికల వేళ ప్రశాంత వాతావరణం ఉండాలని ఫిర్యాదు చేసేందుకు నిరాకరించారు. దీంతో సమస్య సమసిపోయింది.

ఏకాకిగా ఎమ్మెల్యే మధు: సుధీర్‌రెడ్డి



టీడీపీలో చేరిన మైనార్టీలు, ఏర్పేడు నాయకులతో సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17: అరాచక పాలన సాగించిన ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి ప్రజలు తిరుగుబాటు చేయడంతో ఏకాకిగా మారిపోయారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం 16వ వార్డులో వైసీపీ సానుభూతిపరులైన ముస్లిం మైనారిటీలు పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. వారందరికీ సుధీర్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీకాళహస్తిలో నియంతగా వ్యవహరించిన ఎమ్మెల్యే మధు పీడ వదిలించుకోవాలని, ప్రశాంతతకు మారుపేరైన గోపాల్ అన్న పాలనను తిరిగి సాధించుకునేందుకు ప్రజలు కంకణ బద్ధులై ఉన్నారని చెప్పారు. అంతకుముందు ఆర్టీసీ కూడలి మీదుగా మైనారిటీలు టీడీపీ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా నిర్వహించారు.

తొట్టంబేడు: శ్రీకాళహస్తి మండలంలోని యల్లంపల్లి ఎస్టీ కాలనీ, ముచ్చువోలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు జయచంద్రారెడ్డి, దశరథరెడ్డి, గురవయ్య యాదవ్, మునిక్రిష్ణయాదవ్, వెంకటయ్య, బుజ్జయ్య, వెంకటముని, దుర్గయ్య తమ అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. అలాగే ఏర్పేడు మండలం మునిలిపేడు గ్రామానికి చెందిన ధనంజయులు నాయుడు, నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు మునిరాజ, సురేష్, గజేంద్ర, కేశవులు తదితరులు టీడీపీలో చేరారు. రేణిగుంట మండలం మొలగమూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు వెంకటమునిరెడి, భాస్కర్‌రెడ్డి, దాము, ప్రవీణ్, ధర్మయ్య, చెంగయ్య, శ్రీధర్, క్రాంతి టీడీపీలో చేరారు. వీరందరికీ బొజ్జల సుధీర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఊరందూరులో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్, చెంచయ్య నాయుడు, తాటిపర్తి రవీంద్రనాథడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిలికా దోపిడీని అరికట్టమని జగన్‌ను కోరా

తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు



వైసీపీ నేత దువ్వూరు మధుసూదన్ రెడ్డితో చర్చిస్తున్న వరప్రసాద రావు

చిట్టమూరు/వాకాడు, ఏప్రిల్ 17: చిల్లకూరు మండలంలో సిలికా దోపిడీకి గురవుతోందని ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోకపోగా అక్కడే ఉన్న విజయసాయిరెడ్డి కల్పించుకొని సంఘటనా స్థలానికి ఎందుకు వెళ్లావని ప్రశ్నించారని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. బుధవారం చిట్టమూరు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... విజయసాయిరెడ్డి తనను ప్రశ్నించిన సమయంలో అక్కడే ఉన్న అప్పటి మంత్రి బాలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి కల్పించుకొని నియోజకవర్గంలో సమస్యలను సీఎం దృష్టికి తెచ్చారంటే అర్థం చేసుకోవాలే కానీ ఎదురు ప్రశ్నించడం ఏమిటని అసహనం వ్యక్తం చేసినా సీఎం నోరువిప్పలేదన్నారు. వనరులన్నీ దోపిడీకి గురయ్యాయని, వేలాది కోట్ల రూపాయల ఇసుకను దోపిడీ చేశారని విమర్శించారు. ఇటువంటి ప్రభుత్వంలో ఉండలేక అవమానాలు భరించలేక బయటకు వచ్చానని చెప్పారు. అంతకుముందు గునపాటిపాళెం వెళ్లిన వరప్రసాద్ వైసీపీ నాయకుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొని బీజేపీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల కన్వీనర్ జి.కిషోర్‌నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు దువ్వూరు శరత్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు మింగేశారు...

కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు కేటాయించిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని, గ్రామాల్లో కనీస వసతులకు డబ్బులు లేని పరిస్థితి దాపురించిందని వరప్రసాదరావు అన్నారు. బుధవారం జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బి. ప్రమీల నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తీరప్రాంత గ్రామాలకు రోడ్డు వసతి, వన్యప్రాణి విభాగం పరిధిలో రోడ్ల నిర్మాణానికి తాను గెలిచిన వెంటనే అనుమతులు కోసం కేంద్రంలో సంప్రదింపులు జరిపి సాధించుకొస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు బీజేపీ నాయకులు పి.పురుషోత్తమరెడ్డి, టీడీపీ నాయకులు చిల్లకూరు దశరథ రామిరెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అక్కడి నుంచి ఆయన వైసీపీ రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి నందగోపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పార్టీలోకి ఆహ్వానించారు.

శాస్త్రోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం



స్వామి అమ్మవారికి హారతులిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం పెద్ద కొట్టాయి ఉత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పరిమళభరిత పుష్పమాలలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు. అక్కడి నుంచి ఆలయంలోని కోట మండపం వద్ద పగడ చెట్టు కింద సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉషోమూర్తులను కొలువుదీర్చారు. వట్టివేర్లతో చలువ వాతావరణం కల్పించారు. అనంతరం విశేష అభిషేకాలు పూజలు చేశారు. ధూప దీప నైవేద్యాలను సమర్పించిన తర్వాత తిరిగి ఆలయంలోని అలంకార మండపంలో కొలువుదీర్చారు. ఈ విశేష ఉత్సవాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ఏర్పేడు, ఏప్రిల్ 17: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. మండలంలోని పల్లంపేటలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, వెంకటరత్నం, మునిరెడ్డి, మునిశేఖర్, మునిభాస్కర్, రమేష్, శీను, మస్తాన్, మునికిషోరమ్మ, రాజా, రామయ్య, మునిరాజా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు



టీడీపీలో చేరిన వారితో ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 17: మండలంలోని కల్యాణపురం పంచాయతీకి చెందిన వైస్ సర్పంచు హేమాద్రి, బొప్పరాజపాలెం పంచాయతీ మాజీ సర్పంచు ఢిల్లీబాబు, గోవిందప్ప నాయుడుకండ్రిగ సర్పంచు ఆర్ముగం తమ అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. వారికి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో సాయి, సాగర్, కుమారస్వామి, బాలు, షణ్ముగం, అశోక్, సుబ్రహ్మణ్యం, నాగరాజు, భాస్కర్, కోటి, జైపాల్, రమేష్, రామ్‌రాజ్, మణి, వెంకటేష్, చిన్నరాజ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుమన్‌కుమార్, నాయకులు భాస్కరన్, ఊరప్ప, గోవిందస్వామి, మాణిక్యం రెడ్డి, గాండ్ల గోవిందశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మృతులకు నివాళి

తొట్టంబేడు, ఏప్రిల్ 17: మండలంలోని లింగమనాయుడుపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు లోకనాథం నాయుడు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి బొజ్జల బృందమ్మ టీడీపీ జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కనపర్తి గ్రామంలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పులి మస్తాన్ ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కమనీయం సీతారాముల కల్యాణం



శ్రీకాళహస్తిలో మంగళసూత్రం చూపుతున్న అర్చకులు - రేణిగుంట జీఎంవీధిలో రాములవారి కల్యాణంలో భక్తులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17: సీతారాముల కల్యాణ వేడుక కమనీయంగా జరిగింది. శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని పట్టణంలోని నెహ్రూ వీధిలో వెలసిన పట్టాభి రామాలయంలో మూలమూర్తులకు విశేష పూజలు చేశారు. ఆలయం ఎదుట కల్యాణ వేడుక కోసం వేదిక సిద్ధం చేశారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కొలువుదీర్చారు. అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల రామనామ స్మరణ మధ్య ఆదర్శ దంపతుల వివాహ వేడుక రమణీయంగా జరిగింది. అనంతరం ఉత్సవమూర్తులకు ధూప దీప నైవేద్య హారతులు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నాగేశ్వరరావు, పాలకమండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయం వద్ద రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ శ్రీరాముని చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మేళాగారం సుబ్రహ్మణ్యం రెడ్డి, కండ్రిగ ఉమ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని సిద్ధిరాజుకండ్రిగ సీతారామ ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు నడుమ పురవీధుల్లో ఊరేగించారు.

సత్యవేడు: పట్టణంలోని వైదేహి కల్యాణ మండపం ఆవరణలోని కోదండ రామచంద్ర స్వామి ఆలయం, మాధనపాళెంలోని సీతారామస్వామి ఆలయాల్లో నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. కోదండరామచంద్రస్వామి కల్యాణోత్సవానికి ఉభయ దారులుగా వీఆర్ కండ్రిగకు చెందిన రామరత్నం నాయుడు దంపతులు వ్యవహరించారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం, పెద్దపాండూరు, చిన్నపాండూరు గ్రామాల్లో నవమి వేడుకలు జరిగాయి. ఆయా మందిరాల్లో నిర్వాహకులు సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలోని అభయాంజనేయ ఆలయంలోని శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడి విగ్రహాలకు అభిషేకాలు చేసి పూలతో అలంకరించారు. అదే విధంగా గాజులపెళ్ళూరు, బుచ్చినాయుడు కండ్రిగ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

కేవీబీపురం: మండలంలోని రాజులకండ్రిగ, ఓళ్ళూరు, సదాశివపురం, కళత్తూరు, సూరమాల గ్రామాల్లోని సీతారాముల మందిరాల్లో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేణిగుంట: పట్టణంలోని భజనగుడి, జీఎంవీధిలో ఉన్న రామాలయం, సాయిబాబా ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల కల్యాణం నిర్వహించారు

నారాయణవనం: మండల కేంద్రంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి నిత్యా పూజా కైంకర్యాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, మంత్ర పుష్పాలతో అలంకరించి భక్తుల దర్శనం కల్పించారు. ఉదయం 11 గంటలకు సీతా లక్ష్మణ సమేత కోదండ రామస్వామికి పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరి నీళ్లు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై ఊరేగించారు.

పుత్తూరు వార్తలు

నేడు గాలి భానుప్రకాష్ నామినేషన్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 17: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గాలి భానుప్రకాష్ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 8.30 గంటలకు నగరి పట్టణ పరిధిలోని కొత్తపేట వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించనున్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు గాలి ముద్దుకృష్ణమ నాయుడు అభిమానులు కార్యక్రమానికి హాజరయ్యేందుకు పెద్దఎత్తున తరలిరానున్నారు. గాలి భానుప్రకాష్ అభ్యర్థిత్వాన్ని ఫిబ్రవరి 26వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయం తెలిసిందే. వరుసగా రెండోసారి నగరి ఎమ్మెల్యే అభ్యర్థిగా గాలి భాను ప్రకాష్ పోటీ చేస్తున్నారు. నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి టీడీపీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు చేశాయి. నామినేషన్ల ఘట్టంతో టీడీపీ ఎన్నికల సమరశంఖాన్ని లాంఛనంగా పూరించనుంది.

బంగారమ్మ ఆలయంలో చోరీ

వడమాలపేట, ఏప్రిల్ 17: మండలంలోని ఎస్‌వీ పురం వడ్డిపల్లిలోని బంగారమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని రెండు హుండీలను పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. రెండేళ్లకు పైగా హుండీ ఆదాయం లెక్కించలేదని, సుమారు రూ.లక్ష పైగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేడుకగా సీతారాముల కల్యాణం



పుత్తూరు మండలం తిమ్మరాజు కండ్రిగ, వడమాలపేట మండలం ఏఎం పురంలో సీతారాముల కల్యాణం

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 17: శ్రీరామ నవమి పురస్కరించుకుని బుధవారం పుత్తూరు మండల తడుకు పంచాయతీ తిమ్మరాజు కండ్రిగ గ్రామంలో కొలువైన సీతారాముల ఆలయంలో కల్యాణోత్సవం వేడుకగా సాగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. వేద మంత్రాల నడుమ సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. భక్తులకు అక్షింతలు అందించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, మహిళలు, యువత, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వడమాలపేట: మండలంలోని ఏఎంపురంలోని రాములవారి ఆలయంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కోటి వంశీ వర్మ, గీతాంజలి దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. పట్టుపీతాంబరాలు, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. వేద పండితులు వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మేళాతాలలు, భక్తుల శ్రీరామ నామాల నడుమ మాంగళ్యధారణ చేయించారు. భక్తులకు అన్నదానం చేశారు. వడమాలపేటలోని సంజీవరాయ ఆలయంలో సీతారాములకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీడీపీని గెలిపించండి



ఎస్‌వీ పురంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

వడమాలపేట, ఏప్రిల్ 17: అవినీతికి పాల్పడుతున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి టీడీపీని గెలిపించాలని చిత్తూరు పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు మునిశేఖర్ కోరారు. బుధవారం ఎస్‌వీ పురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ హామీలను వివరిస్తూ, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని ఓటర్లకు కరపత్రాలు అందజేశారు. ప్రచారంలో నాయకులు ధనంజయులు నాయుడు, వెంకటయ్య, శేషాద్రి యాదవ్, హేమావతి, లక్ష్మీప్రసన్న, ప్రకాష్‌రాజు, గిరీష్ రాజు, వెంకయ్య, శేఖర్‌నాయుడు, శ్రీనివాసులు, రామూర్తినాయుడు, పెద్దబ్బరాజు, వెంకేటశ్వరరావ్, బాలకృష్ణ, నారాయణరాజు, ఆదినారాయణ, ఆదెయ్య, దూర్వాసులు, సుబ్రహ్మణ్యం యాదవ్, చిరంజీవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.